ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి జిల్లా వార్తలు

5★ మంగళవారం 23 ఏప్రిల్ 2024

పేదల సంక్షేమానికి పాటుపడేది కాంగ్రెస్ పార్టీ 8లో..

8లో.. బీజేపీ మతోన్మాద విధానాలను తరిమికొట్టాలి



శ్రీనివాస్ గొమాసే అభ్యర్థిత్వానికి ఓకే..

- బీజేపీ అభ్యర్థి మార్పుపై జరుగుతున్న ప్రచారానికి తెర
- నామినేషన్ దాఖలు నాటికి బీఫాం వస్తుందన్న మంద కృష్ణమాదిగ
- ఈ నెల 24న నామినేషన్ దాఖలుకు సన్నాహాలు
- ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేత యత్నాలు విఫలం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా శ్రీనివాస్ గొమాసే కు బదులు మరొకరికి టిక్కెట్ ఇస్తారని వారం రోజులుగా జరుగుతున్న ప్రచారానికి తెరపడింది. అభ్యర్థిని మార్చేది లేదని, నామినేషన్ దాఖలుకు సన్నాహాలు చేసుకోవాలని అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేకు పార్టీ రాష్ట్ర నాయకత్వం నుంచి పిలుపురావడంతో ఆయన ఈ నెల 24వ తేదీన నామినేషన్ దాఖలు చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. గత నెలలో కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరిన శ్రీనివాస్ గొమాసేకు మూడు రోజుల్లోనే పార్టీ టిక్కెట్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలను కలవడంతో పాటు ప్రచారాన్ని కూడా ఆరంభించారు. అనూహ్యంగా శ్రీనివాస్ గొమాసేను మార్చి ఆయన స్థానంలో ప్రస్తుత ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేతకు టికెట్ ఇస్తున్నట్లుగా ముమ్మరంగా ప్రచారం జరిగింది. దీంతో బీజేపీ కేడర్‌లో ఒకింత గందరగోళం నెలకొన్నది. బీఆర్ఎస్ పార్టీలో ఉన్న వెంకటేశ్ నేత ఈ ఎన్నికల్లో తనకు బీఆర్ఎస్ టిక్కెట్ రాదని భావించి రెండు నెలల క్రితం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన కాంగ్రెస్‌లో చేరడంతో పెద్దపల్లి టిక్కెట్ ఆయనకే వస్తుందనే ప్రచారం జరిగింది. కానీ పార్టీ గడ్డం వంశీకృష్ణ పేరు ప్రకటించడంతో వెంకటేశ్ నేత నిరాశ, నిస్పృహలకు గురయ్యారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చారు. ఆ తర్వాత బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలిసి తనకు పెద్దపల్లి టిక్కెట్ ఇస్తే పార్టీలో చేరతానని, తాను కూడా నేతకాని సామాజిక వర్గానికి చెందిన వాడినేనని, తమ సామాజిక వర్గానికి చెందిన ఓట్లు అధికంగా ఉన్నాయని చెప్పుకువచ్చారు. దీంతో ఆలోచనలో పడ్డ బీజేపీ నేతలు శ్రీనివాస్ గొమాసేకు ఇవ్వాల్సిన ప్రచార సామగ్రిని నిలిపి వేసింది. అభ్యర్థిని మారుస్తున్నారనే ప్రచారం ఊపందుకున్నది. ఈ నెల 19వ తేదీన ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయాలని భావించిన శ్రీనివాస్ వాయిదా వేసుకున్నారు.

బీజేపీకి మంద కృష్ణ మాదిగ మద్దతు..

ఎస్సీ వర్గీకరణకు ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం అనుకూలంగా వ్యవహరిస్తుండడంతో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ బీజేపీకి మద్దతు పలికారు. రాష్ట్రంలో గల 17 పార్లమెంట్ స్థానాల్లో మూడింటిని ఎస్సీలకు రిజర్వు చేయగా, అందులో వరంగల్, నాగర్‌కర్నూల్ నుంచి ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు టిక్కెట్లు ఇప్పించడంలో మందకృష్ణ మాదిగ కీలక పాత్ర పోషించారు. పెద్దపల్లి నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మాల సామాజిక వర్గానికి చెందిన నాయకులకు టిక్కెట్లు ఇవ్వడంతో బీజేపీ నుంచి నేతకాని సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాస్ గొమాసేకు టిక్కెట్ ఇవ్వాలని మందకృష్ణ ప్రతిపాదన పెట్టారు. దీంతో ఆయన సూచన మేరకు పార్టీ శ్రీనివాస్ గొమాసేకు టిక్కెట్ ప్రకటించింది. మధ్యలో ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేత బీజేపీలో చేరుతున్నారని ఆయనకే టిక్కెట్ ఇస్తారంటూ ప్రచారం జరగడంతో గందరగోళం నెలకొన్నది. సోమవారం పెద్దపల్లిలో నిర్వహించిన మాదిగ, నేతకాని కులస్తుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి హాజరైన మంద కృష్ణమాదిగ శ్రీనివాస్ గొమాసేకు బీజేపీ టిక్కెట్ ఇప్పించింది నేనేనని, నామినేషన్ దాఖలు చేసే వరకు బీ ఫారం కూడా ఆయనకే ఇప్పిస్తానని ప్రకటించారు. ఇదంతా మాజీ ఎంపీ వివేక్ కుటుంబం విషప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు. ఇది ఒక పేదవాడికి, ఒక ధనికుడి మధ్య జరుగుతున్న పోరాటమని, డబ్బులు లేని శ్రీనివాస్ గొమాసేకు తలా కొన్ని డబ్బులు ఇచ్చి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం పార్టీ రాష్ట్ర నాయకత్వం నుంచి శ్రీనివాస్‌కు ఫోన్ చేసి నామినేషన్ దాఖలుకు సన్నాహాలు చేసుకోవాలని చెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నాలుగోరోజు 14 మంది అభ్యర్థుల నామినేషన్

- 25కు చేరుకున్న అభ్యర్థుల సంఖ్య

పెద్దపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి (ఎస్సీ) పార్లమెంటు స్థానానికి సోమవారం ఒకే రోజు 14 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో ఇప్పటివరకు నామినేషన్లు దాఖలు చేసిన వారి సంఖ్య 25కు చేరుకున్నది. స్వతంత్ర అభ్యర్థులుగా దుర్గం సమ్మయ్య, అక్కపాక తిరుపతి (రెండో సెట్) ఆర్నకొండ రాజు, గడ్డం మారుతి, రాముల కార్తీక్, జుమ్మిడి గోపాల్, అంబాల మహేందర్, జనగామ నరేష్, ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్, జాడి ప్రేమ్‌సాగర్ (రెండో సెట్), దాగం సుధారాణి, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా మంద రమేష్ తలా ఒక సెట్ దాఖలు చేశారు. అదేవిధంగా స్వతంత్ర అభ్యర్థులు గద్దల వినయ్‌కుమార్, బొట్ల చంద్రయ్య తలా రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఇప్పటి వరకు నాలుగు రోజుల్లో 25 మంది అభ్యర్థులు మొత్తంగా 31 సెట్ల నామినేషన్‌లు దాఖలు చేసినట్లు పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. నామినేషన్ల దాఖలుకు ఇంకా మూడు రోజుల సమయం మిగిలి ఉన్నది. అభ్యర్థుల సంఖ్య 16 దాటితే రెండు ఈవీఎంలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులతో పాటు ఒకటి నోటా ఉంటుంది. పరిస్థితి చూస్తుంటే మరికొంత మంది నామినేషన్లు దాఖలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

తహసీల్దార్ జాహెద్ పాషా



ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ జాహెద్ పాషా

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 22: ఓటు హక్కు ఒక వజ్రాయుధమని ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని తాసిల్దార్ జాహెద్ పాషా కోరారు. మండలంలోని వెన్నంపల్లి గ్రామంలో సోమవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాల మేరకు గ్రామంలో తహసిల్దార్ ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించి ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తమ ఓటుతో సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాలని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వెన్నంపల్లి, చిన్నారాతుపల్లి, కాల్వశ్రీరాంపూర్ గ్రామంలో పోలింగ్ శాతం తగ్గిందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అన్నిగ్రామాల్లో 100శాతం పోలింగ్ జరిగే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. స్వచ్ఛందంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవా లని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామ్మోహనచారి, ఎంపీఓ గోవర్ధన్, గ్రామ స్పెషల్ ఆఫీసర్ నాగార్జున, ఆర్ఐ ఉదయశ్రీ, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు గ్రామస్తులు పాల్గొన్నారు.

'భగీరథ' నీరు రావడం లేదని ఫిర్యాదు



విచారణ జరుపుతున్న ఎంపీవో సుదర్శన్

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 22: మండలంలోని రాఘవపూర్‌కు చెందిన ఓ యువకుడు మిషన్ భగీరథ నీరు సరఫరా కావడంలేదని హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశాడు. సోమవారం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూస్ డీఈ సతీష్, ఎంపీవో సుదర్శన్ విచారణ చేపట్టారు. ఇంటి పరిసరాలను పరిశీలించి వేసవికాలం దృష్ట్యా మిషన్ భగీరథ ద్వారా అవసర మున్న నీరు సరఫరా అవుతాయని, అంతకుమించి నీరు వినియోగం ఉంటే ఇంటిముందు ఉన్న చేతిపంపును వినియోగించుకోవాలని వారికి సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, సిబ్బంది ఉన్నారు.

గుండేటి రాజేష్‌కు సేవా అవార్డు

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 22: వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కాలనీకి చెందిన గుండేటి రాజేష్ ప్రదానం చేసింది. సోమవారం గోదావరిఖనిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మానవత్వ వెలుగు అవార్డు-2024 ఉగాది పురస్కారాల్లో భాగంగా నిర్వాహకులు సురభి శ్రీధర్ గుండేటి రాజేష్‌కు పురస్కారాన్ని అందజేశారు. జిల్లా సినీ అభిమనుల సంఘాల ఐక్యవేదిక ఛైర్మన్‌గా రాజేష్ అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా బ్లూక్రాస్ ఇన్‌చార్జిగా మూగజీవుల మనుగడ కోసం అవసరమైన కార్యక్రమాలు చేసినందుకు అవార్డుకు ఎంపికయ్యారు. కళా రంగంలో కాలనీకి చెందిన పుప్పాల సంహితకు ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ చేతులమీదుగా వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు అవార్డును అందజేశారు.

మావోయిస్టులూ చట్టసభలకు ఎన్నిక కండి

- పోలీసుల గౌరవ వందనం స్వీకరించండి
- రామగుండం సీపీ ఎం శ్రీనివాస్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, ఏప్రిల్ 22: అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు పోరాటం చేయాల్సింది అడవిలో కాదని, ప్రజాజీవనంలోకి వచ్చి ప్రజాసమస్యలపై చట్టబద్ధంగా పోరాడాలని, ఎన్నికల్లో నిలబడి చట్టసభలకు ఎన్నికై పోలీసులతో గౌరవ వందనం పొందాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ మావోయిస్టులకు పిలుపునిచ్చారు. సోమవారం కమిషనరేట్‌లో మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావుతో కలిసి మావోయిస్టుల వివరాలతో కూడిన పోస్టర్లు, కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. కేంద్రకమిటీ సభ్యులు, పెద్దపల్లికి చెందిన మల్లోజుల వేణుగోపాల్‌పై రూ.25లక్షలు, మల్లా రాజిరెడ్డిపై రూ.25లక్షలు, పుల్లూరి ప్రసాద్‌రావు రూ.25లక్షల రివార్డు ఉంది. స్టేట్ కమిటీ సభ్యుడు దంగిడి సత్యనారాయణరెడ్డిపై రూ.20లక్షలు, కాల్వ శ్రీరాంపూర్ మండలం కిష్టంపేటకు చెందిన రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేష్‌పై రూ.20లక్షలు, రాణాపూర్‌కు చెందిన వేగోళపు మల్లయ్య, పాలితంకు చెందిన ఆలేటి లచ్చులు, రామగుండంకు చెందిన అప్పాసి నారాయణ, పాలకుర్తి మండలం జయ్యారంకు చెందిన నర్సయ్య, గోపయ్యపల్లికి చెందిన ఐలయ్య, జూలపల్లి మండలం వెంకట్రావ్‌పల్లికి చెందిన ఢీకొండ శంకరయ్య, కొదురుపాకకు చెందిన జువ్వాడి వెంకటేశ్వర్‌రావు ఫొటోలతో కూడిన పోస్టర్లను ఆవిష్కరించారు. మంచిర్యాల జిల్లాకు చెందిన బండి ప్రకాశ్, ఆసరబోయిన రవి, సరోజ, వెంకటేష్, ఆడెల్లు, బడే చొక్కారావు, జాడి పుష్ప, ఆరెపల్లి కృష్ణ తదితర ఫొటోలతో పోస్టర్లు ముద్రించారు. సీపీ శ్రీనివాస్ స్వతాహాగా ఇక మారు సోదరా..! అనే పిలుపుతో రాసిన కరపత్రాన్ని కూడా విడుదల చేశారు. మావోయిస్టులకు ప్రజలు సహకరించవద్దని, వారి సమాచారాన్ని తమకు ఇవ్వాలన్నారు. రామగుండం సీపీ 08728-271333, పెద్దపల్లి డీసీపీ 8712656502, మంచిర్యాల డీసీపీ 8712656503, ఎస్ఐబీ ఇన్‌స్పెక్టర్ 8712656596 నంబర్లకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీపీ పేర్కొన్నారు.

● **సోషల్ మీడియాలో హద్దు మీరితే కఠిన చర్యలు**

రామగుండం పోలీస్ కమిషరేట్ పరిధిలో సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టడం ఎక్కువైందని, హద్దు మీరితే కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ హెచ్చరించారు.

ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతుందన్నారు. కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో 16ఎస్ఎస్‌టీ, 17 ఎఫ్ఎస్‌టీ టీంలు పనిచేస్తున్నాయన్నారు. మద్యం, గంజాయిపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. మంచిర్యాల జిల్లా నుంచి మహారాష్ట్ర ఎన్నికలకు సరఫరా చేస్తున్న లిక్కర్ లోడ్‌ను పట్టుకున్నామన్నారు. దీని విలువ రూ.6.71లక్షలు ఉంటుందన్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో 9.14లక్షల విలువ గల మద్యం, 10.69కిలోల గంజాయి, రూ.50.2లక్షల విలువ గల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. మొత్తంగా రూ.63.45లక్షల విలువ గల నగదు, మద్యం, గంజాయి సీజ్ చేశామని తెలిపారు.

● డ్రోన్ల ద్వారా ఎప్పటికప్పుడు శాంతి భద్రతను పర్యవేక్షించేందుకు ఆపరేషన్ గరుడ చేపట్టామని సీపీ శ్రీనివాస్ తెలిపారు. రామగుండం, పెద్దపల్లిల్లో అమలు చేసేందుకు రూ.2.5లక్షలు అవసరమని, ఇప్పటికే రూ.1లక్ష ఓ బ్యాంకు మేనేజర్ సహకారమందించారన్నారు. త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని సీపీ తెలిపారు.

సామాజిక న్యాయం బీజేపీతోనే సాధ్యం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 22: సామాజిక న్యాయం బీజేపీతోనే సాధ్యమవుతుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పేర్కొన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన నేతకాని, మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా మంద కృష్ణమాదిగ హాజరై మాట్లాడారు. నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ మాదిగలకు, నేతకాని వర్గాలకు తీరని అన్యాయం చేసిందన్నారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన రిజర్వేషన్ ఫలాలు జనాభా ప్రాతిపదికన అందాలని ఆకాంక్షించారు. ఎస్సీ వర్గీకరణ ఎవరికీ వ్యతిరేకం కాదని, అన్ని కులాలకు రిజర్వేషన్లు అందించాలన్నదే ఎమ్మార్పీఎస్ లక్ష్యమన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎస్సీ వర్గీకరణపై దృష్టి సారించలేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు సహకరించని కాంగ్రెస్, కేంద్రంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా ఎస్సీ వర్గీకరణను అనుకూలంగా లేఖ కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో కాంగ్రెస్ మాదిగలను మోసం చేస్తే, 90 రోజుల్లోనే సుప్రీంకోర్టులో ఉన్న చిక్కులను తొలగించేందుకు కేంద్రప్రభుత్వం బలంగా వాదనలు వినిపించి వర్గీకరణ ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ స్థానంలో ఆగర్భ శ్రీమంతుడు, పెట్టుబడి దారుల కుటుంబానికి చెందిన కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ, కార్మిక కుటుంబానికి చెందిన నిరుపేద బిడ్డ బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే మధ్య పోటీ నడుస్తోందని మంద కృష్ణ అన్నారు. నేతకాని, మాదిగ సామాజిక వర్గాలు ఐక్యత తో ఎన్నికల్లో ముందుకు సాగి ఊరూరా అన్ని వర్గాల ప్రజల మద్దతు పొందా లని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, మాదిగ, నేతకాని సంఘాల నాయకులు బండారి కనుకయ్య, సమ్మయ్య, రాయమల్లు, కన్నం అంజయ్య, అంబాల రాజేందర్, దుర్గం మల్లేష్, దుర్గం రాజేష్, దుర్గం నరేష్‌పల్లె సదానందం తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలి

-అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్



పెద్దపల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

పెద్దపల్లిటౌన్/సుల్తానాబాద్, ఏప్రిల్ 22: జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరపై సకాలంలో కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ పెద్దపల్లి, సుల్తానాబాద్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యాసంగి సీజన్‌కు సంబంధించి నాణ్యమైన ధాన్యాన్ని చివరిగింజ వరకు మద్దతు ధరపై కొనుగోలు చేస్తామన్నారు. నాణ్యత ప్రమాణాల ప్రకారం తేమ శాతం వచ్చిన తర్వాత ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని సూచించారు. అవసరమైన వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకొని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో సంబంధిత మిల్లర్లకు తరలించాలని, రైస్ మిల్లుల వద్ద ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం కోత కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షభావ పరిస్థితుల దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టాలని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లలో నమోదు చేసి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో సివిల్ సప్లైయాస్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టుకు పాదయాత్ర

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 22: మండలంలోని అందుగులపల్లి గ్రామం నుంచి 16 మంది హనుమాన్ మాలధారులు కొండగట్టుకు పాదయాత్రగా తరలివెళ్లారు. 40 రోజుల పాటు హనుమాన్ మాలధారతో ఉపవాస దీక్షలు పాటించి మల్యాల మండలం కొండగట్టులో నిర్వహించనున్న చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా కొండగట్టుకు తరలివెళ్లారు. కొండగట్టుకు చేరిన అనంతరం మాలదీక్షను విరమించనున్నారు. కొండగట్టుకు తరలిన వారిలో బర్ల సదయ్య, ఎంచర్ల అంజయ్య, ఇట్యాల అనిల్, కాసర్ల పరమేష్, గొడెట్టి నర్సయ్య, సతీష్, పెంజర్ల పవన్, దాము రాజేందర్ తదితరులు ఉన్నారు.



కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరిన భక్తులు

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

● ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



జూలపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

జూలపల్లి, ఏప్రిల్ 22: రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పంక్షన్‌హాల్లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైస్‌మిల్లర్లతో కుమ్మక్కై అడ్డగోలుగా కోతలు విధించి రైతులను నిలువునా దోచుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పూర్తిగా అండగా ఉంటుందని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి కోతలు ఉండవని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. కేంద్రాల్లో ధాన్యం తూకం వేసిన వెంటనే సంబంధించిన రైతులకు ట్రక్కుషీట్ అందించేలా కృషిచేస్తామన్నారు. అంతే కాకుండా నియోజకవర్గ ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని అన్నారు. ప్రస్తుతం కోత దశలో ఉన్న పంటలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ తమ పెద్దలతో మాట్లాడి ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా ఇటీవల సాగు నీటిని అందించి రైతులను ఆదుకున్నామన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజారిటితో గెలుపించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కృషిచేయాలన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తమ కుటుంబాన్ని ఈప్రాంత ప్రజలు ఆదరిస్తున్నారని, తాము కూడా ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. తమ విశాఖ ట్రస్టు ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను అందిస్తున్నామని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఎంపీగా తనను ఆదరించి అత్యధిక మెజారిటితో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు బొద్దుల లక్ష్మీనర్సయ్య, బండారి రాంమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు, ఎంపీటీసీ దండె వెంకటేశం, నాయకులు అంతటి అన్నయ్య గౌడ్, మినుపాల ప్రకాష్‌రావు, దారబోయిన నర్సింహాయాదవ్, గండు సంజీవ్, జెట్టి సతీష్, చెన్నమనేని విద్యాసాగర్‌రావు, మానుమండ్ల శ్రీనివాస్, తువ్వ కనుకయ్య, కొత్త రవిందర్, కోరికంటి మల్లయ్య, జెట్టి రాజు, బంటు ఎల్లయ్య, మాంకాలి అంజయ్య, చీదురు శ్రీనివాస్ పాల్గొన్నారు.

● **ఎలిగేడు:** పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించి అభివృద్ధికి నాంది పలకాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచార సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. గత ప్రభుత్వ అసమర్థత మూలంగా సబ్బండ వర్గాల ప్రజలు నష్టపోయారని అన్నారు. కరెంటు, నీటి సమస్యలు ఏర్పడ్డాయని తప్పుడు ప్రచారం చేసి లబ్ధిపొందాలని చూస్తున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. రైతులు పండించిన పంటలైన వడ్లకు తూకంలో మోసం, కటింగ్ పేరిట లక్షల రూపాయలు దండుకున్న చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన వెనువెంటనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారని గుర్తుచేశారు. మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్, జూనియర్ కళాశాల ఏర్పాటు చేసే బాధ్యత తనదేనని అన్నారు. పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రం, దేశం బాగుండాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు దుగ్యాల సంతోష్‌రావు, అంతటి అన్నయ్యగౌడ్, న్యాతరి శ్యామ్‌సుందర్, కలువల శ్రీనివాస్, దామోదర్‌రావు, నరహరి సుధాకర్‌రెడ్డి, గొడెల శ్రీనివాస్‌రెడ్డి, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

పాండిచ్చేరీలో రోడ్డు ప్రమాదం

● సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి ● ఎఖీన్‌పూర్‌లో విషాదం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 21: పాండిచ్చేరిలో రోడ్డు ప్రమాదంలో కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. గ్రామానికి చెందిన చాడ రామకృష్ణ -మంజుల దంపతుల కుమారుడు మనీష్ హైదరాబాదులోని ఓ ప్రైవేట్ కంపనీలో రెండు సంవత్సరాలుగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. మనీష్‌తో పాటు మరో ముగ్గురు ఉద్యోగులు చెన్నైతో పాటు పాండిచ్చేరి పట్టణాలకు కంపెనీ పనిలో వెళ్లినట్లు తెలిసింది. చెన్నై నుంచి పాండిచ్చేరికి కారులో మిగితా ఉద్యోగులతో కలిసి వెలుతుండగా రోడ్డు ప్రమాదం జరిగినట్లు మనీష్ బంధువులు తెలిపారు. ప్రమాదంలో మనీష్‌తో పాటు మరో ఉద్యోగి మృతి చెందంగా మిగితా ఇద్దరి గాయాలైనట్లు వారు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనతో దీంతో ఎఖీన్‌పూర్ గ్రామంలో విషాదం అలుముకుంది.



మనీష్ (ఫైల్)

జమ్మికుంటలో 15లక్షల నగదు పట్టివేత



జమ్మికుంటలో నగదు చూపిస్తున్న ఏసీపీ

జమ్మికుంట, ఏప్రిల్ 22: జమ్మికుంట పట్టణంలోని గ్రేన్ మార్కెట్ రోడ్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.15లక్షల నగదు పట్టుబడినట్లు హుజూరాబాద్ ఏసిపి శ్రీనివాస్‌జీ తెలిపారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టుబడిన నగదు వివరాలను ఏసిపి వెల్లడించారు. మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెంకు చెందిన పొనగంటి సురేష్ అనే వ్యక్తి రూ.15లక్షలు నగదు తీసుకు వస్తుండగా పట్టుకున్నారు. పోలీస్‌లు నగదు స్వాధీనం చేసుకోని సీజ్ చేశారు. నగదుకు సంభందించిన ఆధారాలు లేక పోవడం వల్లే సీజ్ చేసినట్లు ఏసిపి తెలిపారు. సమావేశంలో పట్టణ సీఐ వరంగంటి రవి, సిబ్బంది పాల్గొన్నారు. పోలీసుల తనిఖీలు.....రూ. 3 లక్షల పట్టివేత

చందుర్తి : చందుర్తి సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. వేములవాడ పట్టణానికి చెందిన రేగుల రజనీకాంత్ ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.3 లక్షల రూపాయలను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. పట్టుకున్న 3 లక్షల రూపాయలను సీజ్ చేసి, ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

అదుపు తప్పి వాహనం బోల్తా

● ఇద్దరికీ తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22: ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఉన్న మూలమలుపు వద్ద సోమవారం ఓ కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో మండల కేంద్రానికి చెందిన సమీర్, ఎల్లంరెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఓ ప్రైవేటు వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గ్రామంలోని సాయికుమార్‌కు చెందిన వాహనాన్ని మరమ్మతు చేయించడం కోసం సమీర్, ఎల్లంరెడ్డిలు కలిసి సిరిసిల్లకు బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో వాహనం అదుపు తప్పి పల్టీకొట్టింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

ధర్మారం, ఏప్రిల్ 22: మండలంలోని నందిమేడారం గ్రామంలో మేడారం సత్తయ్యకు చెందిన గుడిసె షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం దగ్ధమైంది. గుడిసెలో ఉన్న 10క్వింటాళ్ల బియ్యం, నిల్వ ఉన్న ధాన్యం, దుస్తులు దగ్ధమయ్యాయి. సంఘటన స్థలానికి పెద్దపల్లి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పారు. నిరుపేద కుటుంబానికి చెందిన సత్తయ్యకు ఆర్థిక సహాయం అందజేయాలని స్థానికులు కోరారు. సంఘటన స్థలానికి ఎంఆర్ఐ వరలక్ష్మి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 22: పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన గీత కార్మికుడు బోంగోని చంద్రశేఖర్ సోమవారం ఈతచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా నడుంకు కట్టుకున్న బెల్ట్ తెగడంతో చెట్టు పైనుంచి జారి కిందపడటంతో గాయాల పాలయ్యాడు. స్థానికులు గమనించి క్షతగాత్రుడిని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చంద్రశేఖర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సబ్బితం గౌడ సంఘం సభ్యులు కోరారు.

తాటిచెట్టు పైనుంచి జారిపడి ఒకరు..

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22: ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వరతండాకు చెందిన వ్యక్తి ధరావత్ తిరుపతి ప్రమాదవశాత్తు సోమవారం తాటి చెట్టుపై నుంచి జారి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. చుట్టు పక్కల వారు గమనించి 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని తిరుపతి తాటి ముంజల కోసం తాటి చెట్టు పైకి ఎక్కాడు. ముంజులు కోస్తున్న క్రమంలో కాలు జారి కింద పడ్డాడు. అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల తాటి ముంజల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు పలువురు కింద పడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. తిమ్మాపూర్‌లోని బీమరి దేవయ్య తాటి చెట్టుపై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. తాటి చెట్టు ఎక్కడంలో అనుభవం లేకపోవడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్యా యత్నం

వీర్నపల్లి, ఏప్రిల్ 22 అనారోగ్యంతో బాధపడుతన్న ఓ మహిళ గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీర్నపల్లి మండలం మద్దిమల్లకు చెందిన పాట్ల సుజాత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. సోమవారం కత్తితో గొంతు కోసుకొని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.





కొండగట్టుకు తరలివస్తున్న హనుమాన్ భక్తులు



కొండగట్టుకు తరలివస్తున్న హనుమాన్ దీక్షాపరులు



ముడుపు కడుతున్న భక్తులు



కొండగట్టులో హనుమాన్ దీక్షాపరులు

● నేడు చిన్న హనుమాన్ జయంతి

మల్యాల, ఏప్రిల్ 22: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో మూడు రోజుల పాటు జరిగే హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి దీక్షాపరులు కొండగట్టుకు తరలివస్తూ స్వామి వారిని దర్శించుకుని మాలవిరమణ చేస్తున్నారు. వేకువజామున వేలాదిగా భక్తులు అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల కోసం భక్తులు, అంజన్న దీక్షాపరులు వాహనాలు, కాలి నడకన కొండగట్టుకు తరలివస్తున్నారు. కాగా మంగళవారం చిన్న జయంతి కోసం సాయంత్రం నుంచి భక్తుల రద్దీ పెరిగింది. వేలాదిగా భక్తులు తరలి వస్తున్నారు. జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జయంతి ఉత్సవాల ప్రత్యేక అధికారి, వేములవాడ ఈవో కృష్ణప్రసాద్, ఈవో చంద్రశేఖర్, మల్యాల సీఐ నీలం రవి నిరంతరం కొండపైన పర్యవేక్షిస్తున్నారు.



భక్తుల మాల విరమణ

అంజన్న దీక్షాపరులు హనుమాన్ జయంతి సందర్భంగా స్వామి వారి సన్నిధిలో మాల విరమణ చేస్తారు. మాల విరమణ కోసం కల్యాణకట్టలో మండపం ఏర్పాటు చేశారు. ఇందులోనే భక్తులు మాల విరమణ చేస్తున్నారు. కల్యాణకట్ట వద్ద ఓ భక్తుడు తలనీలాలు సమర్పిస్తున్న క్రమంలో క్షురకుడు, ఆలయ సెక్యూరిటీ సిబ్బంది మధ్య గొడవ జరిగింది. అధికారులు, సిబ్బంది ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు.

● ఉచిత బస్సు సౌకర్యం

కొండగట్టుకు వస్తున్న భక్తుల వాహనాలకు జెఎన్‌టీయూ మార్గంలోని బొజ్జ పోతన వద్ద పార్కింగ్ ఏర్పాటు చేయగా అక్కడి నుంచి ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ఉచిత బస్ సౌకర్యం ఏర్పాటు చేసింది. వివిధ ప్రాంతాల నుంచి తండోప తండాలుగా దీక్షాపరులు కొండగట్టుకు తరలివస్తుండడంతో కొండంతా కాషాయమయంగా మారుతుంది. రామనామంతో అంజన్న సన్నిధి పులకిస్తోంది

ఆంజనేయ స్వామి సన్నిధిలో బుధవారం హనుమాన్ చిన్న జయంతిని దేవస్థానం తరుపున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్తర భారత దేశంలో ప్రతియేటా చైత్ర పౌర్ణమి రోజున హనుమాన్ జయంతిని నిర్వహించనుండగా ఇక్కడ కూడా అదే రోజు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారికి అభిషేకం, పట్టువస్త్రలంకరణ చేశారు.



మాల విరమణ చేస్తున్న దీక్షాపరులు



ధర్మగుండంలో స్నానం చేస్తున్న భక్తులు



కొండగట్టులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు : కలెక్టర్

మల్యాల, ఏప్రిల్ 22: కొండగట్టులో జరుగుతున్న చిన్నహనుమాన్ జయంతి వేడుకలకు భక్తులకు ఎలాంటి సమస్యలు కలుగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షేక్ యాస్మీన్ భాష తెలిపారు. కొండపైన జయంతి ఏర్పాట్లను సోమవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులు తమ దీక్షను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. భక్తులకు సరిపడా టికెట్ కౌంటర్లు తదితరవి ఏర్పాటు చేయగా 114 సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా చేపట్టిన్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారుకులకు భక్తుల కోసం తీసుకోవల్సిన సౌకర్యాలపై పలు సూచనలు చేశారు. దేవస్థానం అధికారుల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూధన్, డిఎస్పీ రఘుచందర్, ఆలయ ఈవో చంద్రశేఖర్, ప్రత్యేక అధికారి కృష్ణప్రసాద్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూ.7,400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 22: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,400 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 32మంది రైతులు 501క్వింటాళ్ల విడి పత్తి, నలుగురు రైతులు ఐదు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,400, కనిష్ఠ ధర రూ.5,500 చెల్లించి పత్తి కొనుగోళ్ల చేపట్టారు.

కొండగట్టుకు పాదయాత్ర చేపట్టిన భక్తులు జాగ్రత్తలు పాటించాలి

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 22: కొండగట్టుకు పాదయాత్ర చేపట్టిన భక్తులు జాగ్రత్తలు పాటించాలని జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ పేర్కొన్నారు. హన్‌మాన్ జయంతి ఉత్సవాలను పురష్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి కొండగట్టు ఆలయం వరకు కాలినడకన వెళ్లే భక్తులకు రేడియం స్టిక్కర్ల ద్వారా రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. సోమవారం జగిత్యాల మండలం తిప్పన్నపేట స్టేజీ వద్ద కాలినడకన కొండగట్టు వెళ్తున్న భక్తులకు రేడియం స్టిక్కర్లను అతికించారు.

కేసీఆర్ నియంత పాలనతోనే అధికారంలోకి కాంగ్రెస్

● పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క సీటు కేటాయించని కాంగ్రెస్ ● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

హుజూరాబాద్, ఏప్రిల్ 22: కేసీఆర్ కుటుంబ నియంత పాలనతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందే తప్ప ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వల్ల కాదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని సాయిరూప గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పదేళ్లలో కేసీఆర్ కుటుంబం అనేక అక్రమాలు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగల అభివృద్ధిని అడ్డుకోవడమే కాకుండా అదే సమయంలో బీసీలను రాజకీయంగా అణగదొక్కుతున్నాడన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలను ఓట్లు అడిగే హక్కు కాంగ్రెస్ అధిష్ఠానానికి కానీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేదన్నారు. కాంగ్రెస్ దృష్టిలో దళితులంటే మాలలు అయినప్పుడు మాదిగల ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికంగా రెడ్డి సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలిచే సీట్లు అగ్రకులాలకు ఇస్తూ ఓడిపోయే సీట్లు బీసీలకు కేటాయించారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి ముస్లింలకు ఇస్తే, రేవంత్‌రెడ్డి హయాంలో ఒక్క మంత్రి పదవి కూడా ముస్లింలకు ఇవ్వలేదన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎమ్మార్పీఎస్ బీజేపీకి మద్దతు ఇస్తుందన్నారు. ముస్లింలు బీజేపీ పార్టీని వ్యతిరేకించవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు చేసేది ఏం లేదన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఆర్ రామచంద్రం, ఎం శ్రీనివాస్, టి వసంత్, వెంకటస్వామి, బి అనిల్, ఆర్ సాగర్, డి రవీందర్, అంజయ్య, టి రాజు, బి సారయ్య, ఆర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

పాత కక్షలతో కుటుంబంపై దాడి

● వాహనాలు ధ్వంసం
● ముగ్గురికి తీవ్ర గాయాలు

కోనరావుపేట, ఏప్రిల్ 22: పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని ఒక కుటుంబంపై రెండు కుటుంబాలకు చెందిన వ్యక్తులు దాడి చేయగా ముగ్గురికి తీవ్ర గాయాల య్యాయి. వారి వాహనాలను ధ్వంసం చేశారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెంది న కుతాడి బాబు కుటుంబానికి, లోకిని ఎల్లవ్వ, ప్రశాంత్ కుటుంబాలతో పాతకక్షలు ఉన్నాయి. 15 రోజుల క్రితం కుతాడి బాబు తమ ఇంట్లో చొరబడి రూ. 50 వేలు ఎత్తుకెళ్లాడని, ఎల్లవ్వ మెడలోని పుస్తెలతాడు దొంగతనానికి ప్రయత్నించాడని కోనరావుపేట పోలీసులకు ఎల్లవ్వ కుమారుడు సతీష్ ఫిర్యాదు చేశాడు. ఈ క్రమం లో ఆదివారం రాత్రి కుతాడి బాబు, అతని తండ్రి కనక య్య, భార్య శిరీష కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో భోజనం చేస్తుండగా లోకిని సతీష్, లోకిని ప్రశాంత్, లోకిని దేవయ్యలతో పాటు వారి కుటుంబసభ్యులు కారంపొడి, గొడ్డళ్లతో, కర్రలతో వచ్చి మహిళలు బాబు కుటుంబ సభ్యులపై కారంపొడి చల్లగా గొడ్డళ్లతో దాడి చేశారు. వారి ఇంటి వద్ద ఉన్న కారు, ట్రాక్టర్, ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. బాబు తండ్రి కనకయ్యకు తీవ్రగాయాలు కాగా కుటుంబ సభ్యులు ప్రాణభయంతో పరుగులు తీశారు. స్నేహితుల సహాయంతో సిరిసిల్ల హాస్పిటల్‌కు వెళ్లారు. విషయం తెలుసుకున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజనేయులు హాస్పిటల్ వెళ్లి బాధితులను పరిశీలించి వివరాలను సేకరించారు. అనంతరం ధర్మారం గ్రామంలో జరిగిన ఘటన స్థలాన్ని పరిశీలించారు. కుతాడి బాబు ఫిర్యాదు మేరకు లోకిని సతీష్, ప్రశాంత్, దేవయ్యలతో పాటు వారి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా : భార్యా భర్తలకు గాయాలు

● పోలీసులు పట్టుకుంటారనే భయంతో ట్రాక్టర్‌ను వేగంగా నడిపిన డ్రైవర్

రామడుగు, ఏప్రిల్ 22: పోలీసులు వెంటపడుతుండగా ట్రాక్టర్‌ను వేగంగా నడిపిన డ్రైవర్ అది అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు అతని భార్యకు తీవ్రగాయాలయ్యాయి. రామడుగు మండలంలోని గుండి గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. రామడుగు మండల కేంద్రానికి చెందిన బత్తిని రవి, కవితలు వడ్డెర కులస్థులు. బతుకుదెరువు కోసం ట్రాక్టర్ నడుపుకుంటూ జీవిస్తున్నారు. ఆదివారం తెల్లవారు జామున రామడుగు వాగు నుంచి ఇసుకను భార్యా భర్తలు ఇద్దరు ట్రాక్టర్ లోడు చేసుకొని గోపాల్‌రావుపేట్‌లో నిర్మాణం జరుగుతున్న స్థలానికి తరలిస్తున్నారు. గోపాల్‌రావుపేట్ బస్టాండ్ సమీపానికి చేరుకునేసరికి తెల్లవారు జామున జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పోలీస్‌స్టేషన్‌కు చెందిన పోలీసులు ఇన్నోవా వాహనంలో ఓ కానిస్టేబుల్ డ్రైవర్‌తో పాటు గస్తీ నిర్వహిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకునేందుకు పోలీసులు వెంటపడగా ట్రాక్టర్‌లో ఉన్న డ్రైవర్ రవి, తన భార్య కవితలు భయంతో ట్రాక్టర్‌ను వెనుకకు మలుపుకొని వేగంగా వెళ్తున్నారు. ఈ క్రమంలో గుండి గ్రామపంచాయతీ సమీపంలో ట్రాక్టర్ అదుపు తప్పి ఇసుకలోడుతో సహ పిల్ల కాల్వలోకి దూసుకెల్లి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ సంఘటనలో భార్యా భర్తలకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.



గుండిలో బోల్తాపడ్డ ట్రాక్టర్

కల్వర్టులోకి దూసుకెళ్లిన కారు

● నూతన వధూవరులతో సహా ఐదుగురికి తీవ్రగాయాలు

మానకొండూర్, ఏప్రిల్ 22 : కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలంలోని గట్టుదుద్దెనపల్లి వద్ద నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టులోకి కారు దూసుకెళ్లిన సంఘటనలో నూతన వధూవరులతో సహ ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. హన్మకొండకు చెందిన దామెర తిలక్ (36), స్వాతిల వివాహం ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో జరిగింది. సోమవారం నూతన వధూవరులు, వరుడి తల్లిదండ్రులు దామెర సురేందర్ (65), దామెర కౌసల్య (55)తో పాటు పెళ్లి కూతురు చెల్లెలు విద్య(20)లు కలిసి ఒకే కారులో ఐదుగురు హన్మకొండకు బయలు దేరారు. మండలంలోని గట్టుదుద్దెనపల్లి ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద జాతీయ రహదారిపై పనులు నడుస్తుండగా నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టులోకి కారు దూసుకపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్రగాయాలు కాగా కారు నుజ్జునుజ్జు అయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజుకుమార్ తెలిపారు.



కల్వర్టులోకి దూసుకెళ్లిన కారు

నర్సరీలో అగ్ని ప్రమాదం

తిమ్మాపూర్, ఏప్రిల్22: తిమ్మాపూర్ మండల కేంద్రంలో రాజీవ్ రహదారికి సమీపంలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వెనుకాల గల తెలంగాణ వెజిటెబుల్ నర్సరీలో సోమవారం ఉదయం మంటలు చెలరేగాయి. గమనించిన నర్సరీ యాజమని, అందులో పనిచేసే వారు అక్కడికి చేరుకుని మంటలను నివారించేందుకు చాలాసేపు శ్రమపడ్డారు. ఎగిసిపడుతున్న మంటలపై నీటిని చల్లారు. ఈ విషయంపై నర్సరీ యాజమని ఆశా కిరణ్‌ను అడుగగా ట్రేలు ఒకే చోట ఉండటం వల్ల ఎండ వేడిమికి మంటలు అంటుకొని ఉండవచ్చన్నారు. ఈ అగ్ని ప్రమాదంలో దాదాపు 3వేలకు పైగా ప్లాస్టిక్ ట్రేలు, డ్రిప్ సిస్టం పైపులు, గ్రీన్ షెడ్ నెట్ కలిసి సుమారు 4లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని, అధికారులు స్పందించి ఆదుకోవాలని సంఘటన స్థలానికి వచ్చిన తహసీల్దార్ కనకయ్యకు నర్సరీ నిర్వాహకులు విన్నవించారు.



నర్సరీలో మంటలను ఆర్పుతున్న స్థానికులు

మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న లారీ

● ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, ఏప్రిల్ 22 : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో మోటార్ సైకిల్‌ను సోమవారం లారీ ఢీకొన్న ప్రమాదంలో మోటార్ సైకిలిస్టుకు తీవ్రగాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వన్నారం గ్రామానికి చెందిన తాల్లపల్లి సంపత్ అనే వ్యక్తి తన మోటార్‌సైకిల్‌పై గట్టుదుద్దెనపల్లి పెట్రోల్ బంక్‌కు వెళ్లి తిరిగి వన్నారం గ్రామానికి వెళ్తున్నాడు. ఓ లారీ కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తుండగా మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంపత్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న శ్రీనుబాబు

రామగిరి, ఏప్రిల్ 22: మండలంలోని కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని మారుతీనగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో సోమవారం శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ళ శ్రీనుబాబు, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతియాదవ్, నాయకులు వనం రాంచందర్‌రావు, తోట చంద్రయ్య, తులసిరాంగౌడ్, గంట వెంకటరమణరెడ్డి, కొలిపాక సారయ్య, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచితంగా డేటా ఎంట్రీ కోర్సుల శిక్షణ

సుల్తానాబాద్, ఏప్రిల్ 22: పదో తరగతి పూర్తి చేసిన దివ్యాంగులకు ప్రభుత్వం జారీ చేసిన సదరం సర్టిఫికెట్లు కలిగి ఉన్న వారికి రెండు నెలల ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు శ్రీ వాణి డిగ్రీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ బండారి కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ కు చెందిన నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్, ఎస్‌సీపీడబ్ల్యూడి వారి సహకారంతో దివ్యాంగులకు డేటా ఎంట్రీ ఆపరేటర్, రిటైల్ సేల్స్ అసోసియేట్ పర్సన్ అనే రెండు కోర్సులలో రెండు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ కాలంలో హాస్టల్ వసతి కల్పించడంతో పాటు ఐదు వేల రూపాయల స్కాలర్‌షిప్ ఇస్తారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 9642582185, 9855810763 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

26న రంగనాయకుల స్వామి రథోత్సవం

సుల్తానాబాద్, ఏప్రిల్ 22: సుల్తానాబాద్ మండలంలోని నీరుకుళ్ల గ్రామంలోని శ్రీ భూ నీళా సమతే రంగనాయక స్వామి వారి రథోత్సవం ఈ నెల 26న నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధానార్చకులు గోవర్దనగిరి మనోహరాచార్యులు, రాజ్‌కుమారాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ రామ నవమి రోజు నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాగా ఆరు రోజులుగా వివిధ వాహన సేవలు స్వామి వారికి జరుగుతున్నాయన్నారు. సోమవారం శేషవాహన సేవ జరిగిందన్నారు. మంగళవారం పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని పొన్న సేవ, కల్పవృక్ష సేవలుంటాయని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు సూచించారు.

రైస్ మిల్లర్ల వద్ద తూకం మిషన్లు పరిశీలించాలి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 22: రైస్ మిల్లర్ల వద్ద ప్రభుత్వం వరి ధాన్యం తూకం వేసే మిషన్లను పరిశీలించాలని బీఆర్‌ఎస్ నాయకురాలు దాసరి ఉష అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కొనుగోలు కేంద్రాన్ని ఉష పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం తూకం వేసిన తర్వాత వరి ధాన్యం బస్తాలను లారీలో వేసి మిల్లులకు పంపిస్తే ఒక్కొక్క రైస్ మిల్లు వద్ద ఒక్కొక్క రకంగా వరి ధాన్యం తూకం వస్తుందన్నారు. యాసంగిలో క్వింటాల్‌కు రూ.500బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు చేతులెత్తేసిందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి యాసంగిలో రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్, రెండు లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

ఆంజనేయస్వామి ఆలయంలో యజ్ఞం

ధర్మారం, ఏప్రిల్ 22: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ధర్మారం మండల కేంద్రంలో గల ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం దీక్షాపరులు యజ్ఞం నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దీక్షాపరులు యజ్ఞం చేశారు. ఈ సందర్భంగా దీక్షాపరులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆంజనేయస్వామి దీక్షాపరులు పాల్గొన్నారు.

వాటర్ పైప్‌లైన్ మరమ్మతు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

రామగిరి, ఏప్రిల్ 22: మండలంలోని మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి వెంట మరమ్మతు పనుల్లో డ్యామేజ్ అయిన వాటర్ పైప్‌లైన్ (డ్రింకింగ్ వాటర్ పైప్‌లైన్స్) పనులను ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాస్, ఈఈ గ్రిడ్ పూర్ణచందర్‌లు పరిశీలించి సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. వారి వెంట ఎంపీడీవో శైలజ రాణి, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ అండ

అంతర్గాం, ఏప్రిల్ 22: కాంగ్రెస్ ప్రభుత్వం అన్నీ వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తూ ఆయా వర్గాల ప్రజలకు అండగా నిలుస్తుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సతీమణి మనాలీ ఠాకూర్ అన్నారు. సోమవారం అంతర్గాం మండల పరిధిలోని ఆకెనపల్లిలో ఉపాధి కూలీలను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పెద్దపల్లి ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధిస్తే రామగుండం నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాదె సుధాకర్, మద్ది తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

'పేదల పక్షపాతి మోదీ ప్రభుత్వం'


మాట్లాడుతున్న కందుల సంధ్యారాణి

అంతర్గాం, ఏప్రిల్ 22: ఉన్న ఊరిలోనే ఉపాధి హామీ కూలీలకు ఉపాధి కల్పిస్తూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పేదల పక్షపాతిగా నిలబడుతుందని బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. సోమవారం అంతర్గాం మండలంలోని పెద్దంపేట, రాయదండి గ్రామాల్లో ఉపాధి కూలీలను కలిసి పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. త్వరలో కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీల వేతనాలు పెంచనున్నదని పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించి మోదీని మూడోసారి ప్రధానిని చేయాలని కూలీలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట కుమారస్వామి, బరుపటి నారాయణ, పైడిపల్లి విజయ్, ఓదెలు, అజయ్, మనోజ్, సాయికుమార్ పాల్గొన్నారు.

నేత్ర దానం

కోల్‌సిటీ టౌన్, ఏప్రిల్ 22: గోదావరిఖని తిలక్‌నగర్‌కు చెందిన రాంబుచ్చమ్మ, సింగరేణి రిటైర్డ్ కార్మికుడు తాటిపల్లి ఆగయ్యలు అనారోగ్యంతో సోమవారం మరణించగా వారి కుటుంబ సభ్యుల నేత్ర దానానికి అంగీకరించంతో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇద్దరి నేత్రాలను హైదరాబాద్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రావణ్‌కుమార్, లింగమూర్తి, భీష్మాచారి, కెఎస్‌వాసు, ఆరపెల్లి రాజమౌళి, రామకృష్ణ, నూక రమేష్, చంద్రమౌళి, రాములు, కవిత, శశికళ పాల్గొన్నారు.

దశాబ్దాల పాటు ప్రభుత్వాల దాటవేత

- యేళ్ల తరబడి చాలీచాలని వేతనాలు
- ఇబ్బందుల్లో గోపాల మిత్రలు

ఓదెల, ఏప్రిల్ 22: రాష్ట్రంలో ఉమ్మడి పాలన నుంచి విముక్తి పొంది, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటికీ ఆశల సౌధంలో ఉన్న గోపాల మిత్రలు 24 యేండ్ల పాటు చాలీచాలని వేతనాలతో బతుకీడుస్తున్నారు. పశుసంవర్ధక శాఖలో సిబ్బంది కొరతను పూడ్చేందుకు 2000 సంవత్సరంలో అప్పటి ఉమ్మడి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 1,360 మందిని గోపాల మిత్రలను నియమించారు. మండలంలో పదో తరగతి ఉత్తీర్ణతతో నలుగురిని నియమించి, నాలుగు నెలల పాటు శిక్షణ ఇచ్చారు. అప్పుడు ఏడాదికి 12వేల రూపాయలు, మళ్లీ ఏడాది తర్వాత 3,500 రూపాయలు, ఇప్పుడు 11,500 రూపాయలు చొప్పున వేతనాలు అందిస్తున్నారు. అన్ని నిత్యావసర సరుకుల ధరలను పెంచినప్పటికీ, వీరి వేతనాలు పెంచకపోవడంతో గోపాలమిత్ర కుటుంబాలు దినదిన గండంగా బతుకుతున్నారు.

● గోపాల మిత్రలకు శాపం..

గోపాల మిత్రలను సీనియర్ ప్రకారం వెటర్నరీ ఆసుపత్రుల్లో అటెండర్లుగా నియమిస్తామని, అలాగే పశుసంవర్ధక శాఖలో విలీనం చేసి వేతనాలను పెంచుతామని గత ప్రభుత్వాలు చెప్పినా దశాబ్దాల తరబడి దాటవేస్తుండడంతో వీరికి శాపంగా మారింది. మండలంలో నలుగురు గోపాల మిత్రలు 24 ఏళ్ల పాటు నిరంతరం పశువులకు వైద్య సేవలు అందిస్తూ చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతూనే ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చే వేతనం 11,500 అయితే, గోపాలమిత్రలు ఆరువేల నుంచి ఏడువేల రూపాయల మేరకు సొంతంగా ఖర్చు చేసి పశువులకు సేమన్ కొనుగోలు చేస్తున్నారు. ఇక వేతనంలో మిగిలేది కేవలం నాలుగు వేల రూపాయలు మాత్రమే. ప్రస్తుతం గ్రామాల్లో మహిళ కూలీలకు గిట్టుబాటు అయినంత కూడా వీరికి వేతనం రావడం లేదు. దీంతో నాలుగు వేల వేతనంతో 24 ఏళ్ల పాటు తమ కుటుంబాలను పోషించడం కత్తి మీద సాముగా మారింది. పైగా 12 గ్రామాల్లో గోపాల మిత్రలు నిరంతరం సేవలు అందిస్తుండగా, 10 గ్రామాల్లో వెటర్నరి ఆసుపత్రులు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా నిరంతరం సేవలందిస్తూ, అధిక పని భారంతో గ్రామాల్లో పశు ఉత్పత్తిలో గోపాల మిత్రలు ప్రధాన భూమిక పోషిస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వాలు వీరిని గుర్తించక పోవడం గోపాల మిత్రలందరికీ శాపంగానే మారింది.


పశువులకు వైద్యం చేస్తున్న గోపాల మిత్రలు

● ఇచ్చిన వినతులన్నీ చెత్తబుట్టల్లోకి..

పశుసంవర్ధక శాఖలో గోపాల మిత్రలను విలీనం చేయాలని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇచ్చిన వినతులను ఏ ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదు. క్రమబద్ధీకరణ, వేతనాల పెంపుదల కోసం రాష్ట్ర, జిల్లాల, మండలాల వ్యాప్తంగా 42 సార్లు ప్రభుత్వాలకు వినతిపత్రాలను సమర్పించినప్పటికీ, చెత్తబుట్టలోకి పరిమితమవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా తమ బాధలు, కుటుంబ భారాలు, క్రమబద్ధీకరణ గురించి వినతిపత్రాలు అందజేస్తున్నప్పటికీ ఏ ప్రభుత్వం ఇప్పటివరకు తగు చర్యలు తీసుకోకపోవడంతో వారు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఈ విధంగా చాలీచాలని వేతనాలతో గోపాలమిత్రలు ఏళ్ల తరబడి వెట్టి చాకిరికే పరిమితమవుతున్నారు.

● పశుసంవర్ధక శాఖలో విలీనం చేయాలి..



- గోపతి ప్రవీణ్, గోపాలమిత్ర, ఓదెల

దశాబ్దాల తరబడి సొంత ఖర్చులతో పశువుల వృద్ధికి పాటుపడుతున్నాం. ప్రభుత్వం గుర్తించి పశుసంవర్ధక శాఖలో గోపాల మిత్రలను విలీనం చేయాలి. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించి కుటుంబాలను ఆదుకోవాలి.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి: సీడీపీవో


వేడుకల్లో పాల్గొన్న సీడీపీవో తదితరులు

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 22: తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రతిరోజు అంగన్‌వాడి కేంద్రాలకు పంపించి అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో కవిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రం- 4లో ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యూకేషన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో కవిత మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ఆటపాటలతో కూడిన విద్య అందుతుందన్నారు. అనంతరం చిన్నారుల అసైన్‌మెంట్ కార్డులు చిన్నారులకు అందించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో సంపతికుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజుల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు ప్రేమలత, పుష్పవతి, జిల్లా కేంద్రంలోని 10 అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 22: ఇటీవల క్యాన్సర్‌తో మరణించిన గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్, విపంచి వీడియో విజన్ నిర్వాహకులు గాలి సతీష్(సంతోష్) కుటుంబానికి హైదరాబాద్‌కు చెందిన ఎడిట్ పాయింట్ ఫొటోగ్రఫీ సంస్థ సోమవారం రూ.30వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సీనియర్ ఫొటోగ్రాఫర్ మొలుగూరి వెంకటేష్‌గౌడ్, బుర్ర రాజయ్యగౌడ్, దబ్బెట శంకర్, మోత్కు రవి, ఎదులాపురం సుధీర్‌బాబు, రాజుగౌడ్, శ్రీలంశ్రీను, సమ్మయ్య, మంద రవి, పెంట నాగరాజు, సన్నీ శ్రీను, నాగరాజు, మంచికట్ల దేవేందర్, బండారి ప్రసాద్, కిరణ్, సహదేవ్, సురేష్ పాల్గొన్నారు.

వలసవాదులతో అభివృద్ధికి ఆటంకం

- అన్ని వర్గాల ప్రజలను ఆదుకున్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే - మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వలసవాదులతో అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని, అలాంటి వారికి ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సమావేశానికి కొప్పుల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అన్నివర్గాల ప్రజలను ఆదుకొని ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి కృషి చేసిందన్నారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను నట్టేట ముంచిందని విమర్శించారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను అభివృద్ధి చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. రైతులకు రుణమాఫీ, రైతుబంధు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కొత్త మండలాలు, నియోజకవర్గాలు, కొత్త జిల్లాలు ఏర్పాటు చేసుకొని ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. అలాగే ఎన్నికల సమయంలో ప్రజలను ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఎండిపోయిన పంటలతో నష్టపోయిన రైతులను పెద్దపల్లి ఎమ్మెల్యే ఒక్కసారి అయిన కలిసి భరోసా ఇచ్చారా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు ఎన్నో కష్టాలు, ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మళ్లీ ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే ప్రశ్నించే గొంతుక బీఆర్‌ఎస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించుకోవాలని ప్రజలకు కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓదెల జడ్పీటీసీ గంటా రాములు యాదవ్, పార్టీ నాయకులు దాసరి ఉష, బండారి శ్రీనివాస్, మర్కు లక్ష్మణ్, ఉప్పు రాజ్‌కుమార్ పాల్గొన్నారు


కార్యక్రమంలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

జూలపల్లి, ఏప్రిల్ 22: మండల కేంద్రంలోని న్యూబ్రిలియంట్ ప్రైవేటు పాఠశాలలో సోమవారం యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యూయేషన్ డే వేడుకలను పాఠశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేషన్ యొక్క విలువలు, దాని ప్రాముఖ్యంపై కరస్పాండెంట్ సత్యం విద్యార్థులకు వివరించారు. అనంతరం వారికి తగిన బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేసారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షపరులకు భిక్ష

జూలపల్లి, ఏప్రిల్ 22: మండల కేంద్రంలోని రాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం జూలపల్లి మాజీ సర్పంచ్ దారబోయిన నర్సింహాయాదవ్ హన్‌మాన్ స్వాములకు భిక్షను ఏర్పాటుచేశారు. కొద్దిరోజులుగా మండలంలోని ఆయా గ్రామాల్లో హన్‌మాన్ దీక్షలు చేపట్టిన స్వాములకు నర్సింహాయాదవ్ ప్రతీ గ్రామంలోని హన్‌మాన్‌స్వాములకు భిక్షను ఏర్పాటుచేశారు. కాగా చివరి రోజున జూలపల్లి గ్రామంలోని హన్‌మాన్ స్వాములకు భిక్షను ఏర్పాటుచేసి తన మొక్కును తీర్చుకున్నారు. కార్యక్రమంలో విండో చైర్మన్ కొంజర్ల వెంకటయ్య, నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, కొమ్మ పోచాలు, బండి స్వామి పలువురు స్వాములు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పాటుపడేది కాంగ్రెస్ పార్టీ

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 22: పేదల సంక్షేమం కోసం కృషి చేసేది కాంగ్రెస్ పార్టీ అని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. సోమవారం గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్‌ఎస్ ముస్లీం మైనార్టీ అధికార ప్రతినిధి ఎండీ అఫిజుద్దీన్‌తో పాటు 100మంది కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ గెలిచిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీ పథకాలను ప్రవేశపెట్టిందని, ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత మరిన్ని పథకాలను ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. రామగుండానికి పూర్వ వైభవం తీసుకురావడమే తన లక్ష్యమని, రామగుండం నియోజకవర్గానికి మరిన్ని నిధులు తీసుకురానున్నట్లు చెప్పారు. ఎంపీ ఎన్నికల్లో గడ్డం వంశీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, నాయకులు ఫజల్ బేగ్, తిప్పారపు శ్రీనివాస్, నజీమోద్దీన్, ముబీన్, తాజ్, నాజీమ్ పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

ఘనంగా హనుమాన్ విజయయాత్ర


విజయ యాత్రలో పాల్గొన్న భక్తులు

మెట్‌పల్లి, ఏప్రిల్ 22: పట్టణంలో శ్రీ వీర హనుమాన్ విజయయాత్రను విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ నాయకులు ఘనంగా జరిపారు. సోమవారం పట్టణం అనుబంధ గ్రామమైన ఆరపేట శివాలయం నుండి సాయంత్రం యాత్రను నిర్వహించారు. జాతీయ రహదారి గుండా మహాలక్ష్మి దేవాలయం, బస్ డిపో, వ్యవసాయ మార్కెట్ యార్డు, పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, పోలీసు స్టేషన్ మీదుగా అయ్యప్ప స్వామి ఆలయం వరకు శ్రీ వీర హనుమాన్ విజయయాత్రను నిర్వహించారు. యాత్రలో హిందూవులు, హనుమాన్ దీక్షపరులు, యువకులు పాల్గొని జై శ్రీరామ్, జై హనుమాన్ నామసరణంతో జాతీయ రహదారి గుండా భజన చేసుకుంటూ ర్యాలీగా అయ్యప్ప ఆలయంకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ధర్మం, దేవాలయ రక్షణ, సనాతన సంస్కృతి, గోమాత సంరక్షణ కోసం విజయయాత్రను నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు, హిందువులు, హనుమాన్ దీక్షపరులు, యువకులు, భక్తులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మతోన్మాద విధానాలను తరిమికొట్టాలి

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె రాజన్న

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 22: బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద విధానాలను ప్రజలు తరిమికొట్టాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె రాజన్న పిలుపునిచ్చారు. లెనిన్ 154వ జయంతి సందర్భంగా గోదావరిఖని గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దోపిడీ వ్యవస్థను నిర్మూలించి నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం పోరాడిన యోధుడు లెనిన్ అని, ప్రపంచ పీడిత ప్రజల విముక్తి మార్గదర్శకుడు లెనిన్ అని కొనియాడారు. సీపీఐ, సీపీఎం పార్టీలు అనుసరించి నయా రివిజనిస్టు విధానాలను వ్యతిరేకించి చంద్రపుల్లారెడ్డి, చారుముజుందార్, నాగిరెడ్డి, దేవులపల్లి నాయకత్వంలో సీపీఐ(ఎంఎల్) పార్టీ ఆవిర్భవించిం దని, నాటి నుంచి నేటి వరకు ఎంతో మంది అమరులు తమ ప్రాణాలను పనంగా పెట్టి తాడితపీడిత ప్రజల కోసం, దున్నేవానికే భూమి అనే నినాదంతో పని చేస్తున్నట్లు చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ 400సీట్లు సాధిస్తామని విర్రవీగుతున్నారన్నారు. నరేంద్ర మోదీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని, బీజేపీని రాబోయే ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఈదునూరి నరేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చిలుక శంకర్, కే జ్యోతి, దుర్గయ్య, బుచ్చయ్య, రాజేశం, రవికుమార్, శ్రీకాంత్, వెంకన్న, రవీందర్, అబెద్నెగో, మల్లేషం, రాజన్న, రాయమల్లు పాల్గొన్నారు.

● విప్లవ వీర కిశోరం లెనిన్..

అంతర్గాం: మార్క్సిస్ట్ మహోపాధ్యాయుడు లెనిన్ విప్లవ వీర కిశోరమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఐ కృష్ణ అన్నారు. సోమవారం అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట భగత్‌సింగ్ భవన్‌లో లెనిన్ 154వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఎర్ర జెండాను విష్కరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐ కృష్ణ మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణమే లక్ష్యంగా పోరాడటమే లెనిన్‌కు ఇచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం మతతత్వ విధానాలు అవలంబిస్తూ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు పాల్పడుతుందన్నారు. అదే విధంగా లెనిన్ జయంతి, సీపీఐ(ఎంఎల్) పార్టీ ఆవిర్భావ దినోత్సవంను పురస్కరించుకుని రామగుండం పట్టణంలోని ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు నంది రామయ్య పార్టీ జెండాను విష్కరించి లెనిన్‌కు నివాళులర్పించారు. వేరువేరుగా జరిగిన కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు కొల్లూరి మల్లేష్, బొంతు ఆనంద్, కోడిపుంజుల భూమేష్, మేరుగు చంద్రయ్య, ప్రజాపంథా నాయకులు పెండ్యాల రమేష్, జూపాక శ్రీనివాస్, గుమ్మడి వెంకన్న, గుజ్జుల సత్యనారాయణరెడ్డి, మార్త రామన్న, ఆడెపు శంకర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కె రాజన్న

యైటింక్లయిన్‌కాలనీ: లెనిన్ 154వ జయంతి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. లెనిన్‌కు సంతాప సూచకంగా ఎర్రజండాను ఆవిష్కరించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. లెనిన్ స్ఫూర్తితో 1969లో న్యూడెమో క్రసీ ఆవిర్భవించిందని, ఆవిర్భావం నుండి దేశంలోని పేద ప్రజల కోసం అహర్నిశలు పోరాటాలు చేస్తున్నదని పార్టీ జిల్లా నాయకుడు బీ అశోక్ తెలిపారు. జిల్లా నాయకులు రాజేందర్, రామకృష్ణల ఆధ్వర్యంలో జరిగిన మరో కార్యక్రమంలో లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్మికుల పక్షాన, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా ఉద్యమించిన లెనిన్ నేటి యువతరానికి స్ఫూర్తి అని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



ప్రకృతితోనే మానవుడి మనుగడ సాధ్యం

- ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు

రామగిరి, ఏప్రిల్ 22: ప్రకృతితోనే మానవుడి మనుగడ సాధ్యమనే విషయాన్ని సమాజం గుర్తించాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు పేర్కొన్నారు. జూన్5 న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండల సంయుక్తంగా ఏప్రిల్ 10 నుంచి జూన్ 5 వరకు మిషన్ లైఫ్‌స్టైల్‌పై అవగాహన, ఈవెంట్స్ కార్యక్రమాల ఏర్పాట్లలలో భాగంగా సోమవారం జీఎం కార్యాలయంలో ప్రతిజ్ఞ నిర్వహించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి జీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రకృతి, పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసులు, రాజారెడ్డి, కర్ణ, చంద్రశేఖర్, ముప్పిడి రవీందర్‌రెడ్డి, సుధాకర్, నాగేశ్వర్‌రావు, ఐలయ్య, వివిధ విభాగాలకు సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన కార్యక్రమం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 22: ఓసీపీ-1 యాజమాన్యం సోమవారం బేస్‌వర్క్‌షాప్ ఉద్యోగులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉద్యోగులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే కార్యక్రమాల్లో ఈ కార్యక్రమం జరిగింది.

కాలుష్య నియంత్రణ, ప్లాస్టిక్ వినియోగం, వాహనాల వినియోగం తగ్గించడం వంటి విషయాలపై ఆర్జీ-3 పర్యావరణ అధికారి కిషన్ వివరించారు. కార్యక్ర మంలో ప్రాజెక్టు సేఫ్టీ ఆఫీసర్ కోటయ్య, హెచ్‌ఓడీ అజీజ్, ఐఎన్‌టీయూసీ ఏరియా అడ్వయిజర్ జక్కుల దామోదర్‌రావు, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ నక్క రమేష్‌తో పాటు అధికారులు, సూపర్‌వైజర్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వెల్డర్ అభ్యర్థులకు అవకాశం కల్పించండి

మంత్రి శ్రీధర్‌బాబును కోరిన యువకులు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 22: సింగరేణి వెలువరించే ఎక్స్‌టర్నల్ ఉద్యోగ నోటిఫికేషన్లలో వెల్డర్ అభ్యర్థులకు అవకాశం కల్పించేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కోల్‌బెల్ట్ ప్రాంత యువకులు శ్రీపెల్లి రాజు, బైరోజు కృష్ణచారి, శంకర్, నాగరాజు, తదితరులు మంత్రి శ్రీధర్‌బాబుకు విన్నవించారు. ఈ మేరకు ఆయనకు గోదావరిఖనిలో వినతిపత్రం అందించి తమ సమస్యలు తెలిపారు. సింగరేణి ప్రాంతానికి చెందిన నిరుద్యోగులమని, తాము ఐటీఐ వెల్డర్ ట్రేడ్ చదివి శిక్షణ పొందామన్నారు. సింగరేణి సంస్థ ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తున్నా అందులో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ అభ్యర్థులకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. వెల్డర్ అభ్యర్థులకు కూడా ఉద్యోగాలు కల్పించి న్యాయం చేయాలని కోరారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించినట్లు యువకులు తెలిపారు.